గాలివాన బీభత్సంతో పంటలకు నష్టం

- అరటి రైతుకు తీవ్ర నష్టం
- 175 ఎకరాల్లో నేల వాలిన మొక్కజొన్న



తోట్లవల్లూరు లంకలో మిర్చిని ఆరబెట్టిన రైతులు



తోట్లవల్లూరు మండలం తోడేళ్లదిబ్బలంకలో నేలవాలిన మొక్కజొన్న

తోట్లవల్లూరు: గాలివాన బీభత్సం సృష్టించింది. లంకల్లో పంటలు సాగు చేస్తున్న అన్నదాతలకు కంటి మీద కునుకు లేకుండా చేసింది. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలి వీచింది కొద్దిసేపే అయినా, దాని ప్రభావం మాత్రం పలువురు రైతులకు నష్టాన్నే మిగిల్చింది. రొయ్యూరు శివారు తోడేళ్లదిబ్బలంకలో చాలా చోట్ల మొక్కజొన్న పంట నేలవాలింది. కోత దశకు వచ్చిన పంట నేలవాలటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



తోట్లవల్లూరు లంకలో గాలికి పడిపోయిన అరటి గెలలను చూపుతున్న రైతు

నేలకొరిగిన అరటి

తోట్లవల్లూరు లంకలో పలు చోట్ల అరటి పంట గాలుల తీవ్రతకు నేలకొరిగింది. ఎకరానికి 200 మొక్కల చొప్పున పడిపోయాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. గెలలు ప్రస్తుతం తయారీ దశలో ఉన్నాయని, ఈ దశలో నేలకొరగటంతో ఊహించని నష్టం వాటిల్లిందని వాపోయారు. అకాల వర్షంతో మిర్చి రైతులు పొలాల వెంట ఉరుకులు, పరుగులు పెట్టారు. పరదాలతో కల్లాల్లో ఆరబెట్టి ఉన్న పంటను కాపాడుకోవటానికి అష్టకష్టాలు పడ్డారు. 175 ఎకరాల్లో మొక్కజొన్న నేలవాలినట్లు మండల వ్యవసాయాధికారి జి. నాగేశ్వరరావు తెలిపారు. అరటి, మిర్చికి ప్రస్తుతానికి ఇబ్బంది లేదని పేర్కొన్నారు.



గరికపర్రు రహదారిలో కూలిన చెట్టు

పంటంతా నేలవాలింది



రొయ్యూరు శివారు తోడేళ్లదిబ్బలంకలో 12 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నాను. వాతావరణం అనుకూలించి పంట ఏపుగా ఎదిగి కోత దశకు వచ్చింది. ఈదురుగాలుల తీవ్రత వల్ల పంటంతా నేలవాలింది. దీంతో చాలా నష్టం వచ్చే అవకాశం ఉంది.

– గంగిశెట్టి సత్యనారాయణ, కౌలురైతు, తోడేళ్లదిబ్బలంక

ఏమి చేయాలో అర్థం కావటం లేదు



గాలివాన బీభత్సంతో అరటి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. తోట్లవల్లూరు లంకలో మూడు ఎకరాల్లో అరటి పంట సాగు చేస్తున్నా. ఈదురుగాలుల కారణంగా సుమారు 700 వరకు అరటి మొక్కలు నేలవాలాయి. పడిపోయిన గెలలను ఏం చేయాలో అర్థం కావటం లేదు.

– వీరంకి రమేష్‌బాబు, రైతు, తోట్లవల్లూరు

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం



తోట్లవల్లూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



మండవల్లిలో ర్యాలీ నిర్వహించిన ఐసీడీఎస్ సిబ్బంది



నర్సన్నపాలెంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్

తోట్లవల్లూరు: తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠకరమని అంగన్‌వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. స్థానిక ఎస్టీ ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడో కార్యక్రమం బుధవారం జరిగింది. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులకు తల్లి పాల విశిష్టత, పౌష్టికాహారం గురించి అంగన్‌వాడీ కార్యకర్త కోకిలారాణి అవగాహన కల్పించారు. ముర్రుపాలు బిడ్డకు ఎంతో బలమని, వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని చెప్పారు. ఆకుకూరలు, పప్పుధాన్యాల ఉపయోగాల గురించి వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు విజయకుమారి, భాగ్యం, సలోమి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాలు

నర్సన్నపాలెం(మొవ్వ): మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పక్షత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 22వ తేదీ వరకు వరకు కొనసాగే 7వ పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమాల్లో రెండో రోజైన బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. మొవ్వ సెక్టార్ పరిధిలోని మొవ్వ–5వ కేంద్రం (నర్సన్నపాలెం) కేంద్రంలో సూపర్‌వైజర్ ఏనుగు పుణ్యవతి ఆధ్వర్యంలో కార్యకర్త ఎస్.నాగమల్లేశ్వరి గర్భిణులు, బాలింతలు, తల్లులకు పౌష్టికాహార విశిష్టతను వివరించారు. అనంతరం పౌష్టికాహార ప్రాముఖ్యత వివరిస్తూ పిల్లలు, తల్లులతో ర్యాలీ నిర్వహించారు.

మండవల్లిలో..

మండవల్లి: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు పోషణ్ పక్వాడ ఆక్టివిటీస్ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా బుధవారం భైరవపట్నంలో వెయ్యి రోజుల ప్రాముఖ్యత, ర్యాలీ నిర్వహించారు.

పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాగించాలి

వానపాముల(పెదపారుపూడి): పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు తాగిస్తే ఎంతో మంచిదని వెంట్రప్రగడ సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.శివనాగమణి అన్నారు. మండలంలోని వానపాముల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహార పక్షోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

నిర్ణయించిన రుసుం వసూలు చేయాలి

గుడ్లవల్లేరు: మండలంలోని అన్ని మీ సేవా కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉన్న అన్ని రెవెన్యూ సేవలకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన రుసుం మాత్రమే వసూలు చేయాలని తహసీల్దార్ బి.లోకరాజు బుధవారం తెలిపారు. మండలంలో ఎక్కడైనా అధిక రుసుం వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన రుసుం పట్టికను ప్రతి మీ సేవా కేంద్రం, గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలని ఆదేశించారు.

నిర్ణయించిన రుసుమే తీసుకోవాలి

పెదపారుపూడి: మండలంలోని మీసేవ కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో రెవెన్యూ సేవలకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుమే ప్రజల వద్ద నుంచి తీసుకోవాలని తహసీల్దార్ వై. రంగారావు బుధవారం తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు.

రెవెన్యూ సేవలకు చెల్లించాల్సిన రుసుం వివరాలు

పమిడిముక్కల: రెవెన్యూ శాఖ సేవలను గ్రామ సచివాలయం, మీసేవ ద్వారా నిర్ణీత రుసుం మాత్రమే చెల్లించి అర్జీ దాఖలు చేసి పొందవచ్చని తహసీల్దార్ నవీన్ కుమార్ పేర్కొన్నారు. చెల్లించిన నగదుకు తప్పక రసీదు తీసుకోవాలని తెలిపారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు రూ.50, ఆలస్యంగా నమోదు చేసిన జనన, మరణ ధ్రువపత్రాలకు రూ.35, మ్యూటేషన్ పట్టాదారు పాస్‌బుక్‌కు రూ.150 చెల్లించాలని పేర్కొన్నారు. అడంగల్‌లో మార్పులకు రూ.50, పట్టాదారు పాసుబుక్ రీప్లేస్‌మెంట్‌కు రూ.150, 22(ఏ) నుంచి తొలగింపు అర్జీకి రూ.50, పట్టా సబ్‌డివిజన్‌కు రూ.550, వ్యవసాయ భూమి విలువ సర్టిఫికెట్ రూ.50 చెల్లించాలని తెలిపారు. ల్యాండ్ కన్వర్షన్ సర్టిఫికెట్‌కు రూ.50, పొజిషన్ సర్టిఫికెట్‌కు రూ.50, దేవదాయ భూమి రెగ్యులరైజేషన్‌కు రూ.40 మాత్రమే చెల్లించాలని పేర్కొన్నారు.

నూరు శాతం కంప్యూటరీకరణ పూర్తి

కైకలూరు: కైకలూరు డివిజన్ 41 సహకార సంఘాల్లో నూరు శాతం కంప్యూటరీకరణ పూర్తయిందని ఏలూరు జిల్లా కో–ఆపరేటివ్ అధికారి (డీసీఓ) అరిమిల్లి శ్రీనివాసరావు తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ప్రగతిపై కైకలూరు ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో అభినందన సమావేశం బుధవారం నిర్వహించారు. సిబ్బంది పనితీరును అభినందించారు. రుణాలు, ఎరువుల పంపిణీ, గోల్డ్ లోన్లు వంటివి కంప్యూటరీకరణ ద్వారా పారదర్శకంగా ఉంటుందన్నారు. అనంతరం తాలూకా సెంటర్‌లో చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో సబ్ డివిజనల్ అధికారి అబ్దుల్ హదీ తదితరులు పాల్గొన్నారు.



కైకలూరు డివిజన్ సిబ్బందితో డీసీఓ అరిమిల్లి శ్రీనివాసరావు

పాలకొల్లు నుంచి శ్రీశైలం సైకిల్ యాత్ర

పెడన: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నుంచి కర్నూలు జిల్లా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి సైకిల్‌పై యాత్ర చేపట్టిన వ్యక్తులను ఆర్యవైశ్య ప్రముఖులు అభినందించారు. పాలకొల్లు నుంచి బయలుదేరిన మరుదురి నరసింహాచార్యులు, బాణాల సాయికుమార్‌లు సైకిల్‌పై వెళుతుండగా బుధవారం ఉదయం పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు, అఖిల భారత ఆర్యవైశ్య పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు డాక్టరు కొల్లూరి చిన్న వారిని కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి ప్రయాణ వివరాలు తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించి వారికి పండ్లు, కొబ్బరినీళ్ళు, మచిలీపట్నంలో భోజన వసతి ఏర్పాటు చేసి అభినందించి పంపారు. తన ఔదార్యంతో అందించిన సేవలకు ప్రయాణ చేపట్టిన భక్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



శ్రీశైలం సైకిల్‌పై ప్రయాణమైన భక్తులు

నేటి నుంచి వెంకటాచలస్వామి కల్యాణోత్సవాలు

గూడూరు: ప్రసిద్ధి చెందిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటాచలస్వామి దివ్య బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుంచి 14 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.వి.వి.మోహనరావు తెలిపారు. గురువారం స్వామి వార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెను చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. రెండో రోజైన శుక్రవారం జగజ్యోతి, ఎదుర్కోల సన్నాహాలు జరిపి స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. శనివారం రథోత్సవం, ఆదివారం పూర్ణాహుతి, ధ్వజారోహణ తదితర పూజలు ఉంటాయన్నారు. చివరి రోజైన సోమవారం స్వామి వారికి పుష్పయాగోత్సవం, పవళింపు సేవలతో ఉత్సవాలు ముగిస్తాయని వెల్లడించారు.



గూడూరులోని శ్రీ వెంకటాచలస్వామి దేవస్థానం

మంటాడ–ఉయ్యూరు రోడ్డుకు మోక్షమెప్పుడో?

పమిడిముక్కల: విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై మంటాడ శివాలయం నుంచి ఉయ్యూరు బస్టాండ్ వరకు ఉన్న రహదారి పూర్తిగా దెబ్బతింది. రోడ్డంతా గుంతలు పడి, రాళ్లు లేచి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఉయ్యూ రు కేసీపీకి సీజన్‌లో చెరకు బళ్లు, ట్రాక్ట ర్లు వస్తుంటాయి. ప్రతిరోజూ వివిధ పనుల నిమిత్తం కేసీపీకి వాహనాలు వస్తూనే ఉంటాయి. గత కొన్నేళ్లుగా రహదారి అధ్వానంగా ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా సంక్రాంతి నాటికి కనీసం గుంతలైనా పూడుస్తారంటే అదీ జరగలేదు. అధ్వానంగా మారిన దహదారిపై రాకపోకలు సాగక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.



అధ్వానంగా మారిన మంటాడ–ఉయ్యూరు రోడ్డు

రైతులకు పవర్ స్ప్రేయర్ల పంపిణీ

మొవ్వ: ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో 'రైతు కోసం తానా' అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం 10 మంది రైతులకు పవర్ స్ప్రేయర్లను అందజేశారు. స్థానిక బస్టాండ్ సమీపంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పాల్గొని రూ1,25,000 విలువ గల స్ప్రేయర్లను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు వేమూరి పరిశుద్ధరాజు, సర్పంచ్ తూము పూర్ణ చంద్రరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఐగా హనుమంతరావు

గుడ్లవల్లేరు: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా జి.హనుమంతరావు బుధవారం నియమితులయ్యారు. ఆయన నందివాడ మండలంలో ఆర్‌ఐగా పని చేస్తూ గుడ్లవల్లేరుకు బదిలీ అయ్యారు. తహసీల్దార్ బి.లోకరాజుకు తన నియామక పత్రాన్ని అందించి విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పాట్లూరి శివకుమార్ ఎంఆర్‌ఐగా అదనపు బాధ్యతలను నిర్వహిస్తూ వచ్చారు. ఎంఆర్‌ఐ హనుమంతరావు రాకతో ఆ పోస్టు భర్తీ అయింది.

నేడు ఆక్వా రైతుల సమావేశం

కైకలూరు: గుడివాడ రోడ్‌లోని బీఎస్‌ఆర్ ఆక్వా ట్రేడర్స్ వద్ద గురువారం సాయంత్రం 5.30 గంటలకు ఆక్వా రైతుల సమావేశం నిర్వహించనున్నట్లు యజమాని బూరుబోయిన శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ సమావేశంలో భారతీయ రొయ్యల పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలు, సాగు మెలకువలపై చర్చిస్తారన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బీద మస్తాన్‌రావు, స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ విచ్చేస్తారని తెలిపారు. ఆక్వా రైతులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయం

కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

మొవ్వ: మొవ్వ గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. మొవ్వ గ్రామంలో బుధవారం బస్టాండ్ సెంటర్లో రూ.38 లక్షల పంచాయతీ నిధులతో నిర్మించనున్న వ్యాపార దుకాణాల సముదాయం, డ్రెయినేజీ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమారరాజా పాల్గొని భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అందరూ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. గ్రామంలో పారిశుధ్యం సరిగా లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో గ్రామ సర్పంచ్ తూము పూర్ణ చంద్రరావు చొరవ తీసుకుని పంచాయతీ నిధులతో డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టడం అభినందించదగ్గ విషయమన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, కలెక్టర్ బాలాజీ

ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ పంచాయతీలో రూ.కోటి వరకు నిధులను సర్పంచ్ సమకూర్చి అభివృద్ధి పనులకు ఖర్చు చేయడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు వి.పరిశుద్ధ రాజు, పంచాయతీరాజ్ ఎస్ఈ రమణరావు, ఈఈ సుధాకర్‌గౌడ్, తహసీల్దారు మస్తాన్‌రావు, ఎంపీడీఓ విమాదేవి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



పదవులు పొందిన నాయకులకు అభినందనలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

కాజ(మొవ్వ): ఇటీవల వైఎస్సార్ సీపీలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి పదవులు పొందిన నాయకులను పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ బుధవారం అభినందించి ఘనంగా సత్కరించారు. మొవ్వ మండల పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన రాజులపాటి రాఘవరావు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా నియమితులైన మందా శ్రీనివాసరెడ్డిని, జిల్లా యాక్టివిటీ కార్యదర్శిగా నియమితులైన దేవాభక్తుని రాములను అభినందించారు. అలాగే పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, ఎంపీటీసీ సభ్యురాలు పేకేటి వెంకటలక్ష్మి, పెద్దారాయుడు తోట సర్పంచ్ తాతా స్వప్న, నాయకులు బాబ్జి రెడ్డి, ఖాజీ రెడ్డి, రాజులపాటి మురళీ, కొండేటి చందు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

కాజ(మొవ్వ): మొవ్వ మండలం కాజ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికారి ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో బాబ్జి రెడ్డి ఇంటి వద్ద కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎప్పుడూ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. కార్యకర్తలు ప్రజా సమస్యలను నాయకుల దృష్టికి లేదా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఇటీవల భార్యను కోల్పోయి, అనారోగ్యంతో ఉన్న గ్రామ ఎంపీటీసీ–2 యల్లమిల్లి కుటుంబరావు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యాన్ని నింపారు. అనంతరం కాజ గ్రామ శివారు మందపాలెంలోని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కొండేటి ఇందిర, గ్రామ ఉప సర్పంచ్ మంద శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ–1 పేకేటి వెంకట లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, నాయకులు మత్రివాడ బాబ్జి రెడ్డి, ఖాజీ రెడ్డి, తాతా రాంబాబు, సమ్మెట ఆంజనేయులు, ఏనుగ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీటీసీ, కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

బంటుమిల్లి: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచి వినియోగదారులపై భారాలు మోపిందని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఎన్‌డీఓ ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా బుధవారం స్థానిక అంబేద్కర్ సెంటర్లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రపంచంలో క్రూడ్ఆయిల్ ధరలు తగ్గుతుంటే కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఆయిల్ ధరలు తగ్గించకపోగా గ్యాస్ ధరను 50 రూపాయలకు పెంచి వినియోగదారులపై భారం మోపిందని విమర్శించారు. ఎన్‌డీఏలో భాగస్వామిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ ధర తగ్గించేందుకు ప్రయత్నించాలని కోరారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో సీపీఎం, రైతు సంఘాల నాయకులు ఎం. శ్రీనివాసరావు, జీ. నాగేశ్వరరావు, బీ. నాగరాజు, ఎల్. అజయ్‌ఘోష్, పి. వెంకన్న పలు గ్రామాల వినియోగదారులు పాల్గొన్నారు.



బంటుమిల్లి అంబేద్కర్ సెంటర్లో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

క్లుప్తంగా

హైస్కూల్లో వంటశాల నిర్మాణానికి భూమి పూజ



మొవ్వ: స్థానిక శ్రీ మండల కనకయ్య జిల్లా పరిషత్ హైస్కూల్లో రూ.50 లక్షలతో అత్యాధిక వంటశాల నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఆ పాఠశాల పూర్వ విద్యార్థి డాక్టర్ తాతినేని గోపాలరావు, వీణ(హైదరాబాద్) దంపతులు ఆ పాఠశాల విద్యార్థులకు అవసరమైన భోజనశాలను రూ.50 లక్షలతో నిర్మించడానికి ముందుకు వచ్చారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్న ఆ దంపతులను పాఠశాల హెచ్ఎం సూర్యదేవర శ్రీదేవి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గురిందపల్లి బాబురావు, గ్రామస్తులు మండవ వాసుదేవరావు, తాతినేని శరత్, విశ్రాంత హెచ్ఎం మండవ లక్ష్మి నీలవేణి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా సీతారాముల ఊరేగింపు



కైకలూరు: శ్రీరామనవమి వేడుకల ముగింపు సందర్భంగా వేమవరప్పాడు గ్రామంలో సీతారాముల ఊరేగింపు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నవమి వేడుకను నిర్వహించారు. ఊరేగింపు కార్యక్రమంలో మాదా ప్రసాద్, నాగమల్లేశ్వరరావు, వెంకటరత్నం, కాశీ, మణికంఠ, సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు



తోట్లవల్లూరు: రొయ్యూరు శివారు తోడేళ్లదిబ్బలంకలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాన్ని ట్రాన్స్‌కో అధికారులు పునరుద్ధరించారు. స్థానిక రామాలయం వద్ద ఈదురుగాలుల తీవ్రత కారణంగా సోమవారం రాత్రి విద్యుత్ స్తంభం నేలకొరిగిన విషయం విదితమే. దీనిపై ట్రాన్స్‌కో ఏఈఈ దేవదాసు స్పందించారు. యుద్ధప్రాతిపదికన సిబ్బందిని ఏర్పాటు చేసి దెబ్బతిన్న స్తంభం తొలగించి, దాని స్థానంలో కొత్త స్తంభాన్ని బుధవారం ఏర్పాటు చేసి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

క్రీడలు జీవనశైలిలో భాగం కావాలి



నిభానుపూడి(పామర్రు): క్రీడలు ప్రతిఒక్కరి జీవన శైలిలో భాగంగా కావాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. పామర్రు మండలం నిభానుపూడి గ్రామంలో దాసరి రామస్వామి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నీని దాసరి అశోక్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ పోటీలకు 10 టీమ్‌లు హాజరయ్యాయి. కార్యక్రమంలో రిటైర్డ్ హౌసింగ్ ఏఈ దాసరి రామకోటేశ్వరరావు, దాసరి శ్రీను, కిట్టు, హరి, రాము, వేణు, వెంకబాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ర్యాలీ



పెడన: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం పెడన పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు రైల్వే గేటు నుంచి బంటుమిల్లి రోడ్డు, మహాత్మాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. అనంతరం పలువురు నాయకులు కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను విమర్శించారు. ఈ ర్యాలీలో రాష్ట్ర, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేవీవీ ప్రసాదు, ఎస్.వెంకటేశ్వరరావు, ఎ.ప్రసాదు, రైతు, చేనేత సంఘ నాయకులు ఎం.యలమందరావు, ఎల్. పిలిప్, కె. హేమసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

పెదపారుపూడి: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగాయి. వెంట్రప్రగడ, వానపాముల, పెదపారుపూడి, మోపర్రు, యలమర్రు, దోసపాడు, పాములపాడు తదితర గ్రామాల్లో సుమారు రెండు వేల మంది కూలీలు ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్నట్లు టెక్నికల్ అసిస్టెంట్ రంగారావు తెలిపారు.